


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

## రియల్ కేరెక్టర్స్

**సినిమాల్లో కొన్ని** పాత్రలు సృష్టిస్తుంటారు దర్శకులు మనని నవ్వించడానికి. జంధ్యాలగారి చంటబ్బాయి కావచ్చు, శ్రీవారికి ప్రేమలేఖ కావచ్చు. కొన్ని అతి చేసే కేరెక్టర్స్‌ని చూపెట్టడం వలన మనకి నవ్వొస్తుంటుంది. 'తవిక'లు తీసుకెళ్ళి శ్రీలక్ష్మి పొట్టిప్రసాద్‌ని విసిగించడం ఎన్నటికీ మరిచిపోలేం. అలాగే, శ్రీవారికి ప్రేమలేఖలో గోడకి తలబాదుకునే వీరభద్రరావు, "అసలు సుత్తి ఎవరు కనిపెట్టారో తెలుసా?" అని 'నాలుగుస్థంభాలాట'లో సుత్తివేలూ, కనపడినవారికందరికీ సినిమా కథలు చెప్పి చంపేసే శ్రీలక్ష్మీ, లలితా శివజ్యోతీ వారి లవకుశ...టటడడా... అంటూ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్‌తో సహా ఇవ్వడం.. రిక్షా తొక్కే అతను ముందుకి పడిపోయి వుండడం.. ఇలా అతి చెయ్యడం అనేది సినిమాలలో మనని తెగ నవ్విస్తుంది.

ఇవన్నీ కల్పిత పాత్రలా అంటే కావు. రచయితా లేక ఆ దర్శకుడు ఎక్కడో వీరిని చూసే వుంటారు. ఇలాంటివారు గుర్తుండిపోతారు.

వీరు పక్కింట్లో వుంటే గొప్ప వినోదం. మన ఇంట్లో వుంటే విచారం.

మా చిన్నతనంలో మా దూరపు బంధువు ఒకతను "ఆకాశవాణి వార్తలు చదువుతున్నదీ.." అంటూ ఎంటర్ అయేవాడు, వార్తల ముందొచ్చే నేపధ్య సంగీతం, సిలోన్ నుండి వార్తలు చదివే మీనాక్షి పొన్నుదొరై గొంతూ, మామిళ్ళపల్లి రాజ్యలక్ష్మి  గొంతూ, అన్నీ తమాషాగా వాళ్ళలాగే అనుకరిస్తూ న్యూస్‌లు చెప్పేవాడు.

ఆఖర్న "దక్షిణ ఇస్తావా?" అని చెయ్యి జాపేవాడు. ఇవన్నీ  కొంతకాలానికి  బిజీగా వున్న టైంలో ఆతను వస్తే మనకీ విసుగ్గా వుండేది. అతని ఇంట్లో వాళ్ళకి సిగ్గుగా వుండేది పాపం.

మరొక ఆవిడ పాటలు, ఏ శుభకార్యం వచ్చినా, ఆవిడ వస్తే పాట మొదలుపెడ్తుందని మాకు భయంగా వుండేది.. మా అన్నయ్య పెళ్ళిలో 'భలే తాత మన బాపూజీ ' అని మొదలు పెట్టి, మళ్ళీ మళ్ళీ మొదటి చరణమే పాడ్తూ అసలు ఆపడం లేదు. ఆవిడది వినడానికి అస్సలు బాగోని స్వరం పాపం. పైగా చేతిలో 2,000 పై చిలుకు పాటలు రాసిన బౌండ్ బుక్ పట్టుకొచ్చేది. ఇవన్నీ నిజ జీవితంలో టెన్షన్ కలిగించే సంఘటనలు.

మనకి తెలీకుండానే కొన్ని పాడు అలవాట్లు అబ్బుతాయి. అవి ఏంటంటే మన ఇంటి సంగతులు బయట వాళ్ళకి చెప్పడం. మొన్న నేను సింగపూర్ ఎయిర్ లైన్స్‌లో, ఇండియానుండి సియాటిల్ వస్తున్నప్పుడు బిజినెస్ క్లాస్ లాంజ్‌లో ఒకావిడా, భర్త పరిచయం అయ్యారు. ఆవిడ కలుపుగోరుగా మాట్లాడ్తూ భర్త ఉద్యోగం, ఆయన అన్నదమ్ముల వివరాలు చెపుతూ "వీరి రెండో అన్నగారు ఎలా పోయారంటే?" అంటూ దీపావళికి టపాకాయలు తయారు చేస్తూ, జరిగిన అగ్నిప్రమాదంలో ఆయన ఎలా కాలిపోయి ముద్దగా మారినదీ కలిసిన అరగంటలో నాకు కళ్ళముందు జరిగినట్లు చెప్పింది. ఆ తర్వాత నాకు అక్కడ లాంజ్‌లో ఏమీ తినబుద్ధి కాలేది. కాలిపోయిన ఆయన రూపమే గుర్తుకు రాసాగింది.

అసలు అవసరమా? ఒక అపరిచిత వ్యక్తితో పంచుకోడానికి ఇంకేమీ మంచి సంగతులు లేవా? కొంత మందికి తాము చూసిన ఏక్సిడెంట్లూ లేదా చావులూ వర్ణించి చెప్పడం సరదా! వీక్ హార్ట్‌లు వున్న వారికీ, ఆల్‌రెడీ చాలా జబ్బుగా పెద్ద వయసులోనో వున్న వారికీ... ఇది వింటే చాలా ప్రభావం కలుగుతుంది.

'ప్రేమించి చూడు' సినిమాలో చలం, రేలంగికి సినిమా కథ చెప్తూ "అర్ధరాత్రి శ్మశానంలో నక్కల ఊళలు.. ఓ..." అని నక్కలా ఊళ పెడుతూ వుంటే, రేలంగి తారెత్తి పోయి" అమ్మాయిలూ.. వీడు నన్ను కథ చెప్పి చంపేసేట్టు వున్నాడే త్వరగా రండే" అని భయంతో అరుస్తాడు. ఇది నిజంగా నిజం కొందరు దెయ్యాల టాపిక్‌లు వస్తే, తాము చూసినట్టే దెయ్యాల గురించి, భయంకరంగా వర్ణించి కథలు చెప్పేస్తుంటారు "అడవిలో అర్ధరాత్రి పెళ్ళి వారి బృందం వస్తోంది. మాకు కూల్ డ్రింక్స్ ఇచ్చారు. మర్నాడు చూస్తే మేం శ్మశానంలో పడి వున్నాం" అని.

ఇవన్నీ నిజాలో కావో కానీ, గొప్ప నాటకీయతతో చెప్తారు. ప్రతివారిలో ఒక కథకుడు దాగుంటాడు. కొంతమంది స్క్రీన్ ప్లేతో చెప్తారు" మన కళ్ళ ముందు జరుగుతున్నట్లుగా వుంటుంది. కొంత మందికి స్క్రీన్ ప్లే వీక్.. నీరసంగా, చప్పగా, వీళ్ళు చెప్పడం ఎప్పుడు అయిపోతుందిరా బాబూ? అనిపిస్తుంటుంది. మొత్తానికి నా బోటి వాళ్ళ కళ్ళలో పడినప్పుడు. వీళ్ళ కేరక్టర్స్, మేం రాసే కథల్లో తప్పకుండా చోటు చేసుకుంటాయి.

ఈ మధ్య ఇలాంటి కేరెక్టర్ ఒకరు తారసపడ్డారు. వాళ్ళు అమెరికాలో ఎన్నో ఏళ్ళుగా స్థిరపడిన తెలుగు దంపతులు. పిల్లలు ఇక్కడే పెరిగి పెద్దయి పెళ్ళిళ్ళు చేసుకుని సెటిల్ అయ్యారు. నేను ఒకరి ఇంటికి భోజనానికి వెళితే డాలస్‌లో అక్కడ ఈ జంట ప్రత్యక్షమయ్యారు. ఆవిడ పరిచయం చేసుకోడమే కళలు అంటే తనకి ఎంతో ఇష్టమనీ, తాను 'దేవి ఉపాసకురాలి'ననీ పరిచయం చేసుకున్నారు. ప్రస్తుతానికి ఆవిడ పేరు 'దేవి' అనుకుందాం. భర్త సైంటిస్టుగా చేసి రిటైర్

అయ్యారు. చూస్తే సరదామనిషిలాగే వున్నాడు. ఆవిడ ఆహార్యం ఆండాళ్ళు అమ్మవారిని పోలివుంది. అమెరికాలో వుంటూ ఇంత సంప్రదాయంగా వుందే ఈవిడా అని నేను మెచ్చుకున్నాను. ఆవిడకి దాదాపుగా అరవై ఏళ్ళు వుంటాయి. మాటకి ముందు

"దేవి చెప్పింది రాత్రి కలలో ఇవాళ రమణిగారిని కలుస్తాను.. ఆవిడకి చీర పెట్టమని" అనడం..

"దేవి చెప్పింది ఇవాళ నేను వంకాయకూర తింటాననీ" అనడం, కాసేపటికి ఆ 'దేవి చెప్పడం' మీద మాకు నమ్మకాన్ని పోగొట్టింది. దేవి అన్నీ చెప్పేస్తోంది, "ఈ గృహస్తు ఇవాళ వాళ్ళని రాత్రికి వుండిపొమ్మని, వత్తిడి చేసి వుంచేస్తుందని కూడా. ఇంక ఆవిడ రాత్రి సంగీత కళాకారులతో కలిసి భోంచేస్తుండగా, తన పెళ్ళిచూపులు ఎలా అయిందీ? ఆయన్ని ఆవిడ మొదటిసారి ఎక్కడ ఎలా చూసింది చెప్పడం స్టార్ట్ చేసింది. అన్నం తింటున్న గురువుగారి చెయ్యి ఎండిపోతుంది. ఈవిడ ఈ విధంగా చెప్తుతోంది.

"అది మే మాసం. రాజమండ్రిలో వడ్లు వేస్తే పేలాలు అయ్యే కాలం. మా వదినా వాళ్ళ ఇంటి పక్క చింతపిక్కల రాజారావుగారూ వాళ్ళు వుండేవారు. వాళ్ళకి ఇద్దరు పిల్లలు సుజాతా, సుషమా. మా అమ్మ గుమ్మడికాయ తెప్పించి వడియాలు పెడదాం అనుకుంది, వదిన ఆర్గండి చీర మీద ఎంబ్రాయిడరీ వర్క్ చేస్తోంది. అప్పట్లో ఆర్గండీ చీరలు ఫేమస్. నాకు లేత నిమ్మపండు కలర్ ప్లెయిన్ సిల్క్ మీదకూడా వదిన ఇలా ఎంబ్రాయిడరీ వర్క్ చేసింది. సడెన్‌గా అమ్మ గుమ్మడికాయ తరుగుతుంటే వాన పడడం స్టార్ట్ అయింది. ఇదేవిటి నా వడియాలు ఎలా ఎండుతాయని అమ్మకి బెంగ పట్టుకుంది .పక్కింట్లో ఒకావిడ వుండేవారు. ఆవిడని రాధ పిన్ని అనేవాళ్ళం. ఆవిడకి ముగ్గురు పిల్లలు వాళ్ళ పేర్లు.. బ్లా బ్లా బ్లా బ్లా" ఇలా సాగుతోంది కథ.

"నేను చెయ్యి కడుక్కోనా?" అంటున్నారు గురువుగారు. ఆయన కొడుకు నవ్వు ఆపుకుంటున్నాడు. భోజనాలకి కూర్చున్న ఒక్కరొక్కరే లేచి వెళ్ళిపోతున్నారు. చివరకి ఆవిడ సొంత మొగుడుగారు లేచి పైన రికార్డింగ్ స్టూడియో వుందంటే చూసొస్తానని వెళ్ళిపోయారు.

ఈ దేవిగారు గురువుగారిని "అయిపోయింది. ఈ ఒక్కరవ్వా వినేసి వెళ్ళిపొండి" అని కూర్చోపెట్టేసింది.

"ఈయన మేనత్తకి ముగ్గురు ఆడపిల్లలు. దాక్షాయణీ, నాగలక్ష్మీ, నారాయణీ. ఆ నాగలక్ష్మి ఇంటిపక్క మా మేనత్తగారుండేవారు. ఈ అబ్బాయికి అమెరికాలో ఉద్యోగం వచ్చింది. మంచి పెళ్ళి సంబంధం. నీకు తెలిసిన వాళ్ళు ఎవరైనా వున్నారా? అని నాగలక్ష్మి మా మేనత్తని అడిగింది. నేను చిన్నపిల్లని, అప్పుడు పంతొమ్మిదేళ్ళు. నాకేం తెలీదు. మా అమ్మ అమెరికా సంబంధం వద్దు అనేసింది. నాన్నగారు 'కళ్లజోడు విరిగిపోయింది, వరదాచారి షాపుకి వెళ్ళిరా..: ఈ పట్టు కథలోకి వచ్చేస్తోంది, ఇంక అయిపోతుంది అని గొప్ప ఉత్సాహంగా చూస్తున్నాం. ఇంతలో మళ్ళీ బెసిగింది ఆవిడకి "వరదాచారి వాళ్ళు కాకినాడలో వుండేటప్పటినుండీ తెలుసు. వాళ్ళ బావమరిదిగారు మా నాన్నగారి క్లయింట్. ఒక సారి

పొలంలో తమ్ముడు కంచె కట్టేస్తాడని, నాన్నగారి దగ్గరికి కేసు తీసుకొచ్చాడు. ఆయనకి ఇద్దరు కొడుకులు. గరుడాచారీ, గోవిందాచారీ..."

నేను పెరుగన్నలో జాంగ్రీ కలిపేసుకున్నాను ఏం జరుగుతుందో తెలీక. గురువుగారు అక్కడే కుర్చీలో వెనక్కి వాలి ఓ కునుకు తీస్తున్నారు. ధైర్యం చేసి నేను అడిగేసా "ఈ వరదాచారి కొడుకులకీ, మీ పెళ్ళికావడానికీ ఏమైనా సంబంధం వుందా?" అని.

"ఎందుకు లేదూ? వరదాచారి కళ్లజోడు సరిచెయ్యడానికి టైం పడ్తూంది. ఓ గంట తర్వాత రమ్మంటే  మా నాన్న మేనత్తగారింటికి వెళ్ళారుగా.."

"వెళ్ళారు.మీ మేనత్తగారు ఈ అమెరికా రావుగారి సంబంధం చెప్పారు. మీ పెళ్ళి అయింది. అంతేగా?" నేను చెయ్యి కడుక్కోడానికి లేస్తూ అన్నాను.

"అమ్మమ్మా... అంత ఈజీగా అవలేదు. మా మేనత్తగారి బావగారొకరొచ్చారు చివుకుల లక్ష్మణ రావుగారు. ఆయన వస్తూ వస్తూ పనసపండు పట్టుకొచ్చారు. మా నాన్నై పనస తొనలు అంటే ఇష్టం ఆ రోజు ఎండ పెళ్ళున కాస్తోంది"  నేను మళ్ళీ అడ్డు పడ్డాను.

"అసలు ఈ రోజు చెప్తారా? పెళ్ళి చూపులు ఎప్పుడు అయ్యాయో? టైం రాత్రి పదకొండు దాటింది. నేను ఓ గంట ప్రయాణం చేసి ఇంటికి వెళ్ళాలి. గురువుగారూ, వాళ్ళ అబ్బాయీ కచ్చేరీ చేసి అలిసిపోయారు. పడుకోవాలి పాపం."

"అయిపోయింది. మా మేనత్త పనసపండు కోస్తూ, పక్కింటివాళ్ళ మేనల్లుడు, మంచి సంబంధం. అమెరికాలో ఉద్యోగం అని చెప్పింది"

"అమ్మయ్య.. క్లైమాక్స్ కొచ్చాం అనుకున్నాం.

"ఈ చివుకుల లక్ష్మణరావుగరిది బాపట్ల, వారికి ముగ్గురు అమ్మాయిలూ, ఇద్దరు అబ్బాయిలూ, లక్ష్మీ, నరసమాంబ, పర్వత వర్ధిని , సుందర రావూ, రామారావూ" "అమ్మా.. నేనింక వెళ్ళాలి" అని లేచాను.

"దేవి రాత్రే చెప్పింది, మీరు వెళ్తానని తొందర పడ్తారని. ఉండండి. మిమ్మల్ని తీసుకెళ్ళి మా మేనల్లుడి ఇంటికి తీసుకెళ్ళి చీర పెట్టి పంపిస్తా"

"పన్నెండు అయింది నాకు చీరొద్దూ.. ఏం ఒద్దూ"

"లలితా పీఠం నుండి తెచ్చాను, అలా అనకూడదు. దేవి చెప్పింది మీరిలా మొండికేస్తారనీ, వదిలి పెట్టొద్దనీ.."

"దేవికో దణ్ణం. చెంపలు వేసుకుంటాకానీ ఇప్పటికి వదిలిపెట్టండి..

గృహస్తు కలగచేసుకున్నాడు "మేం రమణిగారిని దింపుతాం. మీరు చీర రేపు పెట్టండి. నేను ఆవిడ్ని మళ్ళీ తీసుకొస్తాను"

"అబ్బే దేవి ఒప్పుకోదు. ఇప్పుడే పెట్టి తీరాలి"

ఈలోగా రికార్డింగ్ స్టూడియోలో పాట పెట్టారు ఎవరో.. అంతే ఈవిడ చెంగున గెంతుతూ "నాలోని అమ్మవారు డాన్స్ చెయ్యమని చెప్తోంది" అని డాన్స్ మొదలు పెట్టింది. ఆ మొగుడు సిగ్గుపడిపోలేదు. ఆవిడ్ని ఆపడానికి ప్రయత్నించలేదు. గొప్ప వినయంతో, డెడికేటెడ్‌గా ఆవిడ నృత్యాన్ని వీడియో తీసున్నాడు. మేడ్ ఫర్ ఈచ్ అదర్ అంటే ఇదేనా?

వివశత్వంతో డాన్స్ చేస్తోంది. వివశురాలై 60 యేళ్ళ వయసులో నృత్యం చేస్తూంటే, అదీ ముక్కూ మొహం అప్పటిదాకా తెలీని మగాళ్ళ ముందు. నాకూ ఆ పిలిచిన ఇంటావిడకీ గొప్ప సిగ్గేసింది. అయినా ఆవిడ తలుచుకున్నది చేసే టైప్ కానీ, ఎవరి మాటా వినే రకంలా లేదు. ఆపాల్సిన మొగుడు వీడియో తీస్తున్నాడు గొప్ప పరవశంతో.

ఇది ఒక మానసిక వైపరీత్యం. చీటికీ మాటికీ కంటనీరు పెట్టి దుఖించడం ఆవిడ బలహీనత. డాక్టర్ కి చూపిస్తే ఫలితం వుండొచ్చు. నాకు మాత్రం జాలేసింది.

ఇవన్నీ ఆ భర్తకి ఎవరు చెప్తారు? అతనూ ఆవిడలోని అసహజత్వాన్ని తెగ ఎంజాయ్ చేస్తుంటే పైగా?

ఆ రాత్రి ఒంటిగంటకి నన్ను వాళ్ళ మేనల్లుడి ఇంటికి తీసుకెళ్ళి చీర పెట్టి వదిలింది. ఇంత బలవంతంగా, భయంకరంగా నాకు చీర పెట్టిన వాళ్ళు ఎవరూ ఇంతవరకూ తారసపడలేదు.

ఇంతకీ అక్కడ సినిమా పరిశ్రమకి చెందిన దర్శకులు వుండడం, నేను వుండడం కారణం. ఆవిడకి సినిమాల్లో నటించాలి అని చిన్నప్పటినుండి ఉబలాటం అని ఆలశ్యంగా తెలిసింది.

సినిమాల్లో ఇలాంటి కేరెక్టర్స్ కేవలం దర్శకులు సృష్టికాదు. నిజ జీవితంలో ఇలాంటి జీవులు వుంటారు అని చెప్పడమే నా ఉద్దేశం.

స్వస్తి...

Post your comments







